సాక్షి
హనుమకొండ
గురువారం | 31 | ఆగస్టు | 2023



బాధితులకు సోదరులై..
ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలతో సర్వం కోల్పోయిన వరద బాధితులకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు చేయూతనందించారు. - 8లో▸



చంద్రయాన్-3పై అవగాహన
చంద్రయాన్-3పై ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ వెంకటనారాయణ బుధవారం గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
$33^0/24^0$
జిల్లాలో ఈరోజు ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు అమ్మవారికి పవిత్రోత్సవం



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం అమ్మవారికి వైభవంగా పవిత్రోత్సవం నిర్వహించనున్నారు. ఈసందర్భంగా బుధవారం దేవాలయ అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు చెప్పెల వెంకటనాగరాజు శర్మ, వేదపండితులు, వేద విద్యార్థులు సంప్రోక్షణ నిర్వహించారు. అమ్మవారికి ఊర్ధ సూత్రల దండలను అలంకరించి పవిత్రోత్సం నిర్వహించనున్నారు. దేవాదాయశాఖ ఏసీ, ఆలయ ఈఓ శేషుభారతి పర్యవేక్షించారు.

రేపట్నుంచి సదరం స్లాట్ బుకింగ్

హన్మకొండ అర్బన్: సదరం క్యాంపులకు హాజరయ్యే దివ్యాంగులకు శుక్రవారం నుంచి మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ అందుబాటులో ఉంచనున్నట్లు డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 6 నుంచి నిర్వహించనున్న సదరం క్యాంపుల నేపథ్యంలో ఆర్థోపెడిక్, అంధత్వం, మానసిక, వినికిడి లోపం ఉన్నవారికి మీసేవ కేంద్రాల్లో స్లాట్స్ అందుబాటులో ఉండనున్నట్లు పేర్కొన్నారు. క్యాంపులను దివ్యాంగులు వినియోగించుకోవాలని సూచించారు.

ఐదుగురు డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో బుధవారం నిర్వహించిన బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ సెకండియర్ పరీక్షల్లో మూడు పరీక్ష కేంద్రాల్లో ఐదుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఎ.నరేందర్ తెలిపారు. జనగామలోని ఏబీవీ కళాశాలలో ముగ్గురు, వరంగల్ ఏఎస్ఎం కళాశాలలో ఒకరు, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు డీబార్ అయినట్లు వారు పేర్కొన్నారు.

ప్రముఖుల రాఖీ శుభాకాంక్షలు

హన్మకొండ/వరంగల్ అర్బన్: అన్న–చెల్లెలు, అక్క–తమ్ముళ్ల అనుబంధానికి అద్దంపట్టే పండుగ రక్షాబంధన్ అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. తనపై ఆదరాభిమానాలను చూపిస్తున్న జిల్లా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రక్షా బంధన్ పండుగ సహోదరత్వానికి ప్రతీకగా నిలుస్తుందని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి అన్నారు. నగరప్రజలు ఆనందంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర హ్యాండ్‌బాల్ జట్టు కోచ్‌గా విష్ణువర్ధన్

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ హ్యాండ్‌బాల్ పురుషుల జట్టు కోచ్‌గా హనుమకొండ డీఎస్ఏ కోచ్ బొడ్డు విష్ణువర్ధన్‌ను నియమిస్తూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ ధనలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జమ్మూకశ్మీర్‌లో సెప్టెంబర్ 1నుంచి 7వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టుకు కోచ్‌గా విష్ణువర్ధన్ వ్యవహరించనున్నారు. విష్ణువర్ధన్‌ను సాట్ డీడీ ధనలక్ష్మితో పాటు హ్యాండ్‌బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, సాట్ అసిస్టెంట్ డీడీ అశోక్, హనుమకొండ డీవైఎస్ఓ అశోక్‌కుమార్, ఇన్‌చార్జ్ డీవైఎస్ఓ కె.అనిల్‌కుమార్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆజీజ్‌ఖాన్, కైలాస్‌యాదవ్ అభినందించారు.

రెడ్ క్రాస్ ప్రతినిధులకు రాఖీ కట్టిన గవర్నర్



హన్మకొండ అర్బన్: రాజ్‌భవన్‌లో గవర్నర్, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షురాలు తమిళిసై సౌందర రాజన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రక్షా బంధన్ వేడుకల్లో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రావుకు గవర్నర్ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్ మిశ్రా, సీఈఓ మదన్ మోహన్‌రావు, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఎం.రమేష్, ఒ.శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, జి.అమరేందర్‌రెడ్డి, నటరాజ్, కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రాఖీల కొనుగోలుదారులతో కిక్కిరిసిన హనుమకొండ చౌరస్తాలోని టైలర్స్ స్ట్రీట్



ఐనవోలులో చెట్టుకు రాఖీలు కడుతున్న విద్యార్థులు

రాఖీపౌర్ణమి సందడి

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ. ఈపండుగను గురువారం జరుపుకోనున్నారు. ఈసందర్భంగా బుధవారం వరంగల్ నగరంలోని ప్రధాన కూడళ్లు సందడిగా మారాయి. వరంగల్ రామన్నపేట, బట్టలబజార్, పిన్నవారివీధి, హనుమకొండ చౌరస్తా, టైలర్‌స్ట్రీట్, కాజీపేట చౌరస్తా తదితర ప్రాంతాల్లో రహదారులు రాఖీలు, జంద్యాల కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. రాఖీ కట్టిన తర్వాత సోదరులకు తీపి పదార్థాలు తినిపిస్తారు. దీంతో నగరంలోని స్వీట్‌షాపుల్లో సైతం రద్దీ ఏర్పడింది. ఐనవోలు మండలంలోని ఏకశిల పాఠశాలలో విద్యార్థులు వృక్షాలకు రాఖీలు కట్టారు.

- సాక్షిస్టాఫ్‌ఫొటోగ్రాఫర్ హనుమకొండ/ఐనవోలు



స్మార్ట్ సిటీలో ఈ-స్మార్ట్

‘గ్రేటర్’లో రయ్యి రయ్యిమంటున్న ఎలక్ట్రిక్ వాహనాలు

ఎలక్ట్రిక్ వాహనాల (ఈ.వీ) వినియోగంలో వరంగల్ మహా నగరం మెట్రో నగరాల సరసన చేరుతోంది. రోడ్ల మీద ఎలక్ట్రిక్ వాహనాల రాకపోకలు జోరుగా సాగుతున్నాయి. ఇవి స్మార్ట్ వాహనాలు కూడా కావడంతో టెక్నాలజీ ప్రియులను ఆకర్షిస్తున్నాయి. పదేళ్ల క్రితమే ఎలక్ట్రిక్ వాహనాలు మార్కెట్లోకి వచ్చినా 2019 వరకు అవి మెట్రో నగరాలను దాటి రాలేదు. కానీ ప్రస్తుతం పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో.. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్టు పలు కంపెనీలు.. మంచి ఫీచర్ బైకులతో షోరూంలు ఏర్పాటు చేస్తున్నాయి.

- సాక్షిప్రతినిధి, వరంగల్

- ఈవీలలో మెట్రో నగరాల సరసన వరంగల్
- అనూహ్యంగా పెరిగిన ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం
- కాలుష్య నియంత్రణ, ఇంధన ఆదా
- ‘రెడ్కో’, ఎన్‌పీడీసీఎల్‌ల విద్యుత్ చార్జింగ్ సెంటర్లు

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతుండడంతో విద్యుత్ చార్జింగ్/బ్యాటరీ స్వాపింగ్ సెంటర్లను పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (రెడ్కో), ఎన్‌పీడీసీఎల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్, భాగస్వామ్యం (పబ్లిక్, ప్రైవేట్, పార్టిసిపేషన్–పీపీపీ)తో ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాల్లో 279 చార్జింగ్ సెంటర్లకు స్థలపరిశీలన చేసింది. గ్రేటర్ వరంగల్‌లో 24 కేంద్రాలను ఏర్పాటు చేస్తుండగా.. ఇందులో 9 నేషనల్ హైవేలు, నాలుగు స్టేట్‌హైవేలను కలిపే చోట నెలకొల్పి, నగరంలోని ప్రధాన రహదారుల్లో 11 ఏర్పాటు చేయనున్నారు. స్టేషన్ రోడ్, ఫోర్ట్ రోడ్, ఉర్సు, శంభునిపేట, దేశాయిపేట, ఏనుమాముల, పోతననగర్, పెద్దమ్మగడ్డ, కేఎంసీ, కేయూసీ, గోపాల్‌పూర్, నక్కలగుట్ట, ఆర్‌ఈసీ, సోమిడి, వెస్ట్ సిటీ(సోమిడి), వడ్డేపల్లి, బాలసముద్రం, కాయంపేట, మామునూరు, చింతగట్టు, ఆరెపల్లి, మడికొండ, ఎల్లాపూర్, పంథిని, ఎల్కతుర్తి, కోతులనడుమ, ఉప్పల్, భీమదేవరపల్లిలో అనువైన ప్రాంతాలను పరిశీలించారు.

‘స్మార్ట్ సిటీ’.. పరుగులు

- స్మార్ట్‌సిటీ వరంగల్‌లో.. ఎలక్ట్రిక్ వాహనాలు పరుగులు తీస్తున్నాయి.
- వాహనదారుల అభిరుచికి అనుగుణంగా హీరో ఎలక్ట్రిక్ ఆప్టిమా ఎల్ఏ, ప్యూర్ ఎనర్జీ, బజాజ్, టీవీఎస్, ఓలా, ఒకినవా, ఆంపియర్ తదితర కంపెనీలు షోరూంలను ఏర్పాటు చేశాయి.
- రవాణాశాఖ గణాంకాల ప్రకారం 2021–22 మార్చి వరకు ఉమ్మడి వరంగల్‌లో మొత్తం వాహనాలు 68,032 ఉండగా... 853 ఎలక్ట్రిక్ వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి.
- గ్రేటర్ వరంగల్‌కు వచ్చేసరికి 2021–22 మార్చి వరకు 34,167 వాహనాలకు 647 ఈవీ వాహనాలు నమోదయ్యాయి. 2022 – 23 మార్చి నాటికి 3,289 ఈవీ వాహనాలు నమోదు కాగా.. 2023 మార్చి నుంచి ఆగస్టు 15 వరకే 2,109 ఎలక్ట్రిక్ బైకులు, ఆటోలు, కార్ల కొనుగోళ్లు జరిగాయి.
- పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకు పెరుగుతుండడం.. ఈవీల వల్ల భారీగా ఆదా కావడంతో ప్రజలు కాలుష్య రహిత ఎలక్ట్రిక్ వాహనాలకు మొగ్గుచూపుతున్నారు.

వరంగల్ ఆర్టీఓకు రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ఎలక్ట్రిక్ కారు



ఈ-కార్ల వినియోగం పెరగాలి



ప్రజా రవాణాలో తొలుత ఎలక్ట్రికల్ బ్యాటరీ వాహనాలు రావడం శుభపరిణామమే. వాయు కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఎలక్ట్రికల్ వాహనాలను ప్రోత్సహిస్తోంది. డీజిల్, పెట్రోల్ వాహనాల వాడకానికి స్వస్తి పలకాలి. సర్కారు జాతీయ, నగర రహదారులపై ఎలక్ట్రికల్ ఫాస్ట్ చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది.

- కంచె వేణు, ఆర్టీఓ, హనుమకొండ

ఎలక్ట్రికల్ కారుతో ఆర్థిక భారం తగ్గింది



కార్లలో శబ్దం లేదు. రోజుకు రూ.100లోపు ఖర్చు వస్తోంది. విద్యుత్‌వాడకం కూడా తక్కువే. అతి తక్కువ ఖర్చుతో 220 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నా. డీజిల్, పెట్రోల్ భారం పూర్తిగా తగ్గింది. మధ్యతరగతి కుటుంబాలకు ఈ కారు ఎంతో ఉపయోగం.

- సూరం దామోదర్‌రెడ్డి, హనుమకొండ

ఈవీల వినియోగం పెంచే దిశగా ‘రెడ్కో’

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో.. తెలంగాణ పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ విశేష కృషి చేస్తోంది. ఇప్పటికే పలుచోట్ల ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. గ్రేటర్ వరంగల్‌తో పాటు ఉమ్మడి జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాలకు మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నాం.


- మహేందర్ రెడ్డి, మేనేజర్, ‘రెడ్కో’, వరంగల్

సుఖవంతమైన ప్రయాణం చేస్తున్నా..



నేను విద్యుత్ బైక్‌ను నడిపిస్తున్నా. తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణిస్తున్నా. పెట్రోల్ బైక్‌తో ప్రయాణిస్తున్నప్పుడు కొన్ని శబ్దాలు వినిపించేవి. ఎలక్ట్రిక్ వాహనంలో అలాంటి సమస్య లేదు. ప్రయాణం కూడా సుఖవంతంగా ఉంది.

- ముద్దసాని సత్యనారాయణరెడ్డి, హనుమకొండ



ఇంకెన్నాళ్లు పనులు చేస్తారు?

- ఇంజనీర్లను మందలించిన కలెక్టర్, కమిషనర్
- క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన

వరంగల్ అర్బన్: ‘అభివృద్ధి పనుల్ని గడువులోగా పూర్తి చేయకపోతే ఎలా? ఇంకెన్నాళ్లు చేస్తారు’ అని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఇంజనీర్లను మందలించారు. బుధవారం వరంగల్ పోతననగర్‌లో స్మార్ట్‌సిటీ ద్వారా చేపడుతున్న ల్యాండ్రోమార్ట్, సెకండరీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రూ.3 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న లాండ్రోమార్ట్ పనుల్లో మిషనరీ ఇన్‌స్టాలేషన్, సివిల్ వర్క్ పూర్తయ్యిందన్నారు. మిగిలి ఉన్న ఎలక్ట్రికల్, ఫర్నిషింగ్ పనులు యుద్ధప్రతిపాదికన పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సెకండరీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనుల్లో సివిల్ వర్క్ పూర్తయిందని, వెంటనే యంత్రాలు బిగించాలని సూచించారు. ట్రాన్స్‌పోర్టేషన్‌కు వెనుక భాగంలో ఉన్న నాలాకు రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేయాలని, ఇరువైపులా మొక్కలతో సుందరీకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్ఓ, డాక్టర్ రాజేశ్ ఈఈలు రాజయ్య, సంజయ్‌కుమార్, స్మార్ట్ సిటీ పీఎంఈ ఆనంద్ ఓలేటి, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



ల్యాండ్రోమార్ట్ పనుల్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

నేటినుంచి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె

ఎంజీఎం : నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న స్వీపర్ నుంచి మెడికల్ ఆఫీసర్ వరకు ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నుంచి సమ్మెలోకి వెళ్తున్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లతో పాటు పీహెచ్‌సీల్లో పని చేస్తున్న స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఫార్మసిస్టులు, అకౌంటెంట్‌లు, మెడికల్ ఆఫీసర్లు, స్వీపర్లు సమ్మెలో పాల్గొననున్నారు. దీంతో జాతీయ ఆరోగ్య పథకంలో పనిచేస్తూ వారి విధులపైనే నడుస్తున్న పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో సేవలు నిలిచిపోనున్నాయి. అదేవిధంగా ఎంజీఎం ఆస్పత్రిలోని నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో సైతం ఇబ్బందులు ఏర్పడనున్నాయి. దీనిపై డీఎంహెచ్ఓ సాంబశివరావు మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు సమ్మెకు వెళ్తున్నట్లు రెండు యూనియన్లు మాత్రమే నోటీసులు అందించాయని తెలిపారు. సేవలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

ఉద్యోగుల సమ్మె నోటీస్

తమను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో గురువారం నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఎంలోని అన్ని విభాగాల ఉద్యోగులు, ఎస్ఎన్‌సీయూ (న్యూ బార్న్ కేర్ యూనిట్) ఉద్యోగులు ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు సమ్మె నోటీస్ అందించారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, ఎన్‌హెచ్‌ఎం ఆల్ క్యాడర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేశ్ కన్నా మాట్లాడుతూ.. వివిధ కేటగిరీల్లో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులు ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా.. రెగ్యులర్ చేయకపోవడం బాధాకరమన్నారు. గురువారం నుంచి హనుమకొండ బాల సముద్రం ఏకశిల పార్కు వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సుమలత, అనిల్‌కుమార్, బిజ్జం అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీస్ అందిస్తున్న ఉద్యోగులు

మెగా డీఎస్సీ వేయాలని ర్యాలీ, రాస్తారోకో

- పోలీసులు, పీడీఎస్‌యూ నాయకుల మధ్య వాగ్వాదం
- పలువురి అరెస్ట్

కేయూ క్యాంపస్: డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కేయూలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. క్యాంపస్‌లోని లైబ్రరీ నుంచి సెకండ్ గేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. గేట్ ఎదుట కరీంనగర్ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ సమావేశాల్లో సీఎం కేసీఆర్ స్వయంగా 13,089 ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేస్తామని ప్రకటించి కూడా ఇప్పుడు ఆపోస్టులను తగ్గించడం సరికాదన్నారు. మిగిలిన పోస్టులు కలిపి మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరిని అవలంబిస్తే నిరుద్యోగులతో అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులను అరెస్టు చేయడం అక్రమమన్నారు. రాస్తారోకో చేస్తున్న వారిని అక్కడి నుంచి పంపించేందుకు పోలీసులు యత్నించగా.. విద్యార్థులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు, కేయూ బాధ్యులు నరేశ్, రమేశ్‌ను కేయూ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఆందోళనలో పీడీఎస్‌యూ వరంగల్ జిల్లా కార్యదర్శి నరేశ్, బాధ్యులు అభిరామ్, రమేశ్, వేణు, శ్రీనివాస్, అజయ్, సేవియా, గోపాల్, రాకేశ్, సంగీత, రజియా సుల్తానా, మౌనిక, రవళి పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

వాస్తవిక జాబితాకు సహకరించండి

- ప్రతీ వారం రాజకీయ నేతలతో సమావేశాలు
- కమిషనర్, ఈఆర్‌ఓ షేక్ రిజ్వాన్ బాషా


వరంగల్ అర్బన్: తప్పులు లేని, వాస్తవికతతో కూడిన ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు, వివిధ సంఘాలు సహకరించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్, ఈఆర్‌ఓ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో వరంగల్ తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు తప్పకుండా పాటించాలని, ఎన్నికలు సజావుగా నిర్వహించాల్సి ఉందన్నారు. వాస్తవమైన ఓటర్ల జాబితా తయారు చేసేందుకు ఎన్నికల కమిషన్ తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇచ్చిన సలహాల్ని పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలిపారు. ఓటరు లిస్టు తయారీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకుగాను ప్రతీ బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనునట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో వరంగల్ తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, సీపీఎంల నుంచి కుమారస్వామి శ్యామ్‌సుందర్, రాజేశ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్, ఈఆర్‌ఓ షేక్ రిజ్వాన్ బాషా

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లోకి..

దామెర: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని ల్యాదెళ్ల కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ మాదాసు వెంకటేశ్వర్లు, గ్రామ ఉప సర్పంచ్ మాదాసు కీర్తి బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గులాబీ కండువాకప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతీ గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలాకాపాడుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాగితాల శంకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండు రాము, వైస్ ఎంపీపీ ఎండీ.జాకీర్‌అలీ, యూత్ విభాగం అధ్యక్షుడు మెంతుల రాజు, నాయకులు జన్ను మల్లయ్య, దుబాసి నవీన్, కాంతాల కేశవ రెడ్డి, ఎన్కతాళ్ల రవీందర్ తదితరులు ఉన్నారు.



కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

మహాధర్నాను విజయవంతం చేయాలి

కాశిబుగ్గ సెంటర్ : ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని యూఎస్‌పీసీ వరంగల్ జిల్లా బాధ్యులు వెంకట్‌రెడ్డి, గోవిందరావు, కుమార్, మనోజ్, యాకయ్య పిలుపునిచ్చారు. సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పే రివిజన్ కమిషన్ ఏర్పాటు చేసి మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని, పదోన్నతులు కల్పించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, సర్వీస్ పర్సన్స్‌ను నియమించాలనే తదితర డిమాండ్లతో చేపట్టే ధర్నాకు ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు.

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లా వాసికి కీలక బాధ్యత



హన్మకొండ: బీజేపీ తెలంగాణ రాష్ట్ర డాటా అండ్ కాల్ సెంటర్ టీమ్ కన్వీనర్‌గా ఉమ్మడి వరంగల్ జిల్లావాసి రావుల భరత్ రెడ్డికి అధిష్టానం కీలక బాధ్యత అప్పగించింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాల గ్రామానికి చెందిన రావుల భరత్‌రెడ్డి విద్యార్థి దశలోనే ఏబీవీపీలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. యూకేలో ఉన్నత విద్య పూర్తి చేసి అక్కడే ఉద్యోగం చేసిన ఆయన.. రాజకీయాలపై మక్కువతో స్వదేశం చేరుకుని బీజేపీలో కీలక బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా భరత్ రెడ్డి మాట్లాడుతూ తనను ఈ పదవిలో నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



కరెంట్‌షాక్‌కు గురై మృతి చెందిన రైతు శంకర్

తొర్రూరు రూరల్: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని టీక్యాతండా జీపీ శివారు జగ్న తండాలో జరిగింది. తండాకు చెందిన జాటోత్ శంకర్(50) బుధవారం తన పశువులకు పొలంలో గడ్డి కొస్తున్నాడు. ఈ క్రమంలో వేలాడుతున్న కరెంట్ సర్వీస్ వైర్‌ను గమనించకుండా తాకాడు. దీంతో విద్యుత్ సరఫరా అయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై భార్య సోమక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

బాధితులకు సోదరులై..

వరదతో సర్వస్వం కోల్పోయిన వారికి ఆత్మీయ బంధువులుగా నిలిచారు..

వారు అక్కాతమ్ముళ్లు కాదు.. చెల్లి అన్నయ్యలు కాదు.. అసలే రక్త సంబంధం కాదు.. ఒకరంటే ఒకరికి పరిచయం లేదు. కానీ వారిని ఓ బంధం కలిపింది. అదే వరద బంధం. తోబుట్టువులు కూడా ఆదరించలేని ఈ రోజుల్లో ఎలాంటి సంబంధం లేని వారు 'అధైర్య పడకండి.. మేమున్నామంటూ' క'న్నీటి' వరద నుంచి కాపాడారు. ఇటీవల కురిసిన వర్షం వరంగల్ నగరంతోపాటు భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని పలు గ్రామాల్లో బీభత్సం సృష్టించింది. నిత్యావసరాల నుంచి గృహోపకరణాల వరకు సర్వం వరదలో కొట్టుకుపోయాయి. కట్టుబట్టలు మాత్రమే మిగిలి హాహాకారాలు చేస్తున్న సమయంలో తామున్నమంటూ స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకువచ్చారు. తమకు తోచిన సాయం అందించి వరద బాధితులను క'న్నీటి' కష్టం నుంచి గట్టెక్కించారు. దీంతో నిరాశ్రయులు వారికి శతకోటి వందనాలు పెట్టారు. ఆపదలో కాపాడిన వారే తమకు నిజమైన రక్తసంబంధీకులు అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నేడు రాఖీ పౌర్ణమి సందర్భంగా వరద బాధితలకు చేయూతనందించి ప్రేమబంధం చాటిన వారిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

– ఖిలావరంగల్/భూపాలపల్లి అర్బన్/ ఏటూరునాగారం

సోదరుల్లా అక్కున చేర్చుకున్నారు..

- సామాజిక సేవలో శివనగర్ మిత్ర మండలి ఆదర్శం..
- వరద బాధితులకు పలు రకాలుగా చేయూత

వరద ముంపు బాధితులకు శివనగర్‌లో ఏర్పాటు చేసిన శివనగర్ మిత్రమండలి, వీరలక్ష్మి ఫౌండేషన్ అండగా నిలించింది. మానవతా దృక్పథంతో మేమున్నామంటూ నిత్యావసర సరుకులు, దుప్పట్లు అందజేసింది. వరదల్లో చిక్కుకుని కనీసం తాగేందుకు నీరు, తినడానికి ఆహారం కూడా లభించని సమయాన బాధితుల కన్నీళ్లు తుడిచేందుకు శివనగర్ మిత్ర మండలి, వీరలక్ష్మి ఫౌండేషన్ చైర్మన్ మేరుగు అశోక్ తోబుట్టువులా ముందుకు వచ్చారు. బాధితులను అక్కున చేర్చుకుని ఆహార ప్యాకెట్లు పంపిణీ చేసి వారి ఆకలితీర్చారు. దీంతో పలువురు సమాజసేవకులు మేరుగు అశోక్‌పై ప్రశంసల వర్షం కురిపించారు.



వరద బాధితులకు కూరగాయలు అందజేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు (ఫైల్)

తోబుట్టువులా ఆదుకున్నారు..



ఇటీవల కురిసిన వర్షాలకు మా కాలనీ మొత్తం జలమయమైంది. కాలు బయట పెట్టలేని పరిస్థితి. ఆ సమయంలో తాగునీరుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. దీంతో మీకు మేమున్నామంటూ శివనగర్ మిత్ర మండలి, వీరలక్ష్మి ఫౌండేషన్ బాధ్యులు ముందుకువచ్చారు. తోబుట్టువులా నిలిచి మమ్ములను ఆదుకున్నారు. వారే నాకు నిజమైన సోదరులు. వారికే రాఖీ కట్టి సోదరభావం చాటుకుంటా.

అల్లం స్వరూప, శివనగర్

రక్త సంబంధీకులు కాకపోయినా..



గత నెలలో కురిసిన భారీ వర్షాలకు గ్రామంలో ప్రతి ఇంట్లో వస్తువులు కోట్టుకుపోయి ఇబ్బందులు పడ్డాం. మా బాధలను తెలుసుకున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అన్ని రకాల సహకారం అందించారు. రక్త సంబంధీకులు కాకపోయినా ఎక్కడి నుంచో వచ్చి మాకు సరుకులు అందించారు. వారి సహకారంతో కొంత ఉపశమనం పొందాం.

-కొత్త సుదర్శన్‌రెడ్డి, రైతు మోరంచపల్లి

వారి సహకారం మరువలేనిది



గ్రామంలో వరద కారణంగా ఇబ్బందులు ఎదుర్కొనగా కుటుంబీకులు, తోడ పుట్టిన వారు ఓదార్చే తప్ప ఎవరూ ఆదుకోవడానికి ముందుకు రాలేదు. కానీ వేర్వేరు గ్రామాల నుంచి మాకు పరిచయం లేని వ్యక్తులు వచ్చి వంట సామాను, చద్దర్లు, డబ్బు, అన్నదానం, మంచి నీళ్ల పంపిణీ చేశారు. వారి సహకారం జీవితంలో మర్చిపోలేం.

-చుక్క కవిత, గృహిణి, మోరంచపల్లి

మోరంచపల్లిలో వరద బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు (ఫైల్)



స్వచ్ఛంద సంస్థలు, దాతల ఔదార్యం

- వరద బాధితులకు ఆపన్నహస్తం

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాల్లో గత నెలలో సంభవించిన వరదలతో గ్రామస్తులు సర్వస్వం కోల్పోయారు. కట్టుబట్టలు మాత్రమే మిగిలి పుట్టెడు దుఃఖంలో వీరికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు అండగా నిలిచాయి. సోదరుల వలే మనోధైర్యం నింపుతూ నిత్యావసరాలు, దుస్తులు అందజేసి ఆసరా అయ్యారు. దీంతో ఆడబిడ్డకు పుట్టినింటి నుంచి పంపినట్లు నిత్యావసరాలు అందజేసి తమను ఆదుకున్నారని, వీరి సేవలను జన్మలో మరిచిపోలేమని వరద బాధితులు పేర్కొన్నారు.

వరదలతో అతలాకుతలం



వరదలతో కొండాయి గ్రామం పూర్తిగా అతలాకుతలమైంది. నిరాశ్రయులుగా మిగిలిన మమ్ములను స్వచ్ఛంద సంస్థలు, మహిళా ప్రతినిధులు అక్కా, చెల్లెల్లవలే వచ్చి ఆదుకున్నారు. కట్టుబట్టలతో రోడ్డున పడిన మాకు దుస్తులు, బియ్యం, నిత్యావసర సరుకులు అందచేసి ఆదుకున్నారు. వారి సహాయాన్ని ఎప్పటికీ మర్చిపోలేం.

-కట్ల సందీప్, కొండాయి

సొంతోళ్లు కూడా ఇలా చేయరు..



ఇల్లు నీటిలో మునిగి దిక్కుతోచని స్థితిలో ఉన్న సమయంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు మా దగ్గర వచ్చి కావాల్సిన వస్తువులు అందజేసి ఆదుకున్నారు. సొంతోళ్లు కుడా ఇలా చేయరు. దీనిపై వారికి జన్మజన్మలకు రుణపడి ఉంటాం.

-బొల్లికుంట లక్ష్మి,మల్యాల



హసన్‌పర్తి: రాఖీ ఆకారంలో పెంబర్తిలోని ఏకశిల టెక్నో పాఠశాల విద్యార్థులు

కంబాలపల్లిలో వృక్ష రక్షాబంధన్

- పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలం కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం మొక్కలు, చెట్లకు రక్షాబంధన్ చేశారు. తమ పరిసరాల్లోని మొక్కలు, చెట్లను కాపాడుతామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం హెచ్ఎం రమేశ్ బాబు మాట్లాడుతూ చెట్లు పర్యవరణం, మానవులకు చేస్తున్న మేలును తెలియజేసే ఉద్దేశంతో వృక్ష రక్షాబంధన్ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుడు, పర్యావరణ పరిశోధకుడు వి.గురునాథరావు మాట్లాడుతూ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అవసరంపై అవగాహన ఉండాలన్నారు. 15 సంవత్సరాలుగా ఈ వృక్ష రక్షాబంధన్ దివస్ జరుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్రామనర్సయ్య, ఉప్పలయ్య, శ్రీనివాస్, తిరుపతి, సోమేశ్వర్, శోభారాణి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



వృక్ష రక్షాబంధన్ వేడుకలు జరుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చంద్రయాన్-3 పై అవగాహన

గార్ల: చంద్రయాన్-3పై గార్ల వాసి, ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ గంజి వెంకటనారాయణ బుధవారం గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-3తో చంద్రుడి దక్షిణార్థ గోళంలో విద్యుత్‌శక్తిని ఉత్పత్తి చేసే హీలియం ఖనిజం నిక్షిప్తమైనట్లు గుర్తించామన్నారు. పది కేజీల హీలియం ఖనిజం పొందగలిగితే రాష్ట్రానికి సంవత్సరం పాటు విద్యుత్‌ను అందించవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఆయనను అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చార్లి, అజిత్, సుందరయ్య, రాజేష్, వెంకన్న, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.



చంద్రయాన్-3 గురించి వివరిస్తున్న వెంకటనారాయణ

కర్రతో కొట్టి.. ఉరివేసి..

- భార్యను కడతేర్చిన భర్త..
- కాశిగూడెంలో ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్: మద్యానికి బానిసైన భర్త.. భార్యను దారుణంగా కడతేర్చాడు. కర్రతో కొట్టడంతో పాటు విద్యుత్ ప్లగ్‌లలో వైర్లు పెట్టి కరెంట్ షాక్ పెట్టి హింసించాడు. అనంతరం నిద్రిస్తున్న సమయంలో ఉరివేసి హత్య చేశారు. ఈ ఘటన మండలంలోని రంగరాయగూడెం శివారు కాశిగూడెంలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం కాశిగూడేనికి చెందిన షేక్ ఖాసీమ్ కుమార్తె సయ్యద్ హజరత్‌బీ(28)కి తొర్రూరు మండలం హరిపిరాలకు చెందిన అమీర్‌తో పన్నెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులున్నారు. హజరత్‌బీ, అమీర్ దంపతులు కొన్నేళ్లుగా కాశిగూడెంలో బండ కొట్టే పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన అమీర్.. తరచూ భార్యతో గొడవపడేవాడు. తాను మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వమని వేధించేవాడు. ఈ క్రమంలో అమీర్ మంగళవారం రాత్రి ఇంటికి వచ్చి తాగేందుకు డబ్బులు ఇవ్వమని భార్యతో గొడవపడ్డాడు. కర్రతో కొట్టడంతో పాటు విద్యుత్ ప్లగ్‌లలో వైర్లు పెట్టి కరెంట్ షాక్ పెట్టి హింసించాడు. అనంతరం అర్ధరాత్రి ఆమె నిద్రిస్తున్న సమయంలో ఉరివేసి హత్య చేసి పారిపోయాడు. బుధవారం ఉదయం హజరత్ మృతిచెంది ఉన్న విషయాన్ని గుర్తించిన ఆమె తండ్రి ఖాసీం చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ రాఘవేందర్ ఘటనా స్థలికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, నిందితుడు పరారీలో ఉన్నాడు.



హజరత్‌బీ (ఫైల్)

కొడుకుపై తండ్రి హత్యాయత్నం

- ఆలేరులో ఘటన.. కేసు నమోదు

నెల్లికుదురు: కొడుకుపై తండ్రి హత్యాయత్నం చేశాడు. ఈ ఘటన ఈ నెల 27న మండలంలోని ఆలేరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జనగాం మౌనిక, నరేశ్‌కు 5 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి కుమారుడు నవదీప్, కూతురు ఉన్నారు. నరేశ్ మద్యానికి బానిసై భార్య మౌనికను రోజూ కొడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 15న కూడా మద్యం సేవించి వచ్చి కొట్టగా మౌనిక తన తల్లిగారి ఊరు సూరిపెల్లికి వెళ్లిపోయింది. నరేశ్ ఈ నెల 27న సూరిపెల్లికి వెళ్లి భార్యతో గొడవపడి కుమారుడు నవదీప్‌ను తనతో ఇంటికి తీసుకెళ్లాడు. అనంతరం మద్యం మత్తులో అదే రోజు రాత్రి కుమారుడిపై హత్యాయత్నానికి పాల్పడాడు. ఈ ఘటనను చూసిన గ్రామస్తులు బాబుని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి మౌనికకు విషయం తెలిపారు. మౌనిక ఫిర్యాదు మేరకు నరేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.క్రాంతికిరణ్ వివరించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

మరిపెడ: కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని మాకుల తండాలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మాకులతండాకు చెందిన గుగులలోతు అమృ(27) తనకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో భార్య ప్రమీలతో కలిసి వ్యవసాయ చేస్తున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకావడం, కుటుంబ పోషణ గడవకపోవడంతో భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం వ్యవసాయ భూమి వద్ద అమృ పురుగుల మందు తాగడంతో గమనించిన భార్య.. చుట్టుపక్కల వారి సాయంతో చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. మృతుడికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు.

కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ సీజ్

- కంపెనీపై దాడి.. రూ.2.88 లక్షల విలువైన 20 క్వింటాళ్ల పేస్ట్ స్వాధీనం
- ముగ్గురిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: వరంగల్ నగరంలోని కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీ కంపెనీలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి ముగ్గురు నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. వారినుంచి రూ.2.88లక్షల విలువైన 20క్వింటాళ్ల అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఉర్సు కరీమాబాద్‌కు చెందిన గాయి సతీష్ శ్రీభద్రకాళీ మాత అల్లం, వెల్లుల్లి తయారీ చేసే కంపెనీ ఏర్పాటు చేయగా, ఆదే ప్రాంతానికి చెందిన బిలకిష్ అబువాని మరో కంపెనీ స్థాపించాడు. అదే ప్రాంతానికి చెందిన కూరపాటి నాగరాజు కూడా జై గణేష్ అల్లం, వెల్లుల్లి పేస్ట్ కంపెనీ ఉంది. ముగ్గురు రసాయనాలు కలిపి పేస్ట్ విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులకు పక్కా సమాచారం అందింది. సీపీ రంగనాథ్ ఆదేశాలు.. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సూచనల మేరకు పోలీసులు బుధవారం రాత్రి సతీష్, బిలకిషన్ అబువాని, నాగరాజుకు చెందిన కంపెనీలపై ఆకస్మిక దాడి చేశారు. ముగ్గురుపై కేసు నమోదు చేసి వారినుంచి అల్లం, వెల్లుల్లి పేస్ట్, తయారీకి ఉపయోగించే ముడిసరుకులను సీజ్ చేశారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు పెండ్యాల దేవేందర్, రాంబాబు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ దారుణ హత్య..

- కాంట్రాక్ట్ డబ్బులు అడిగినందుకు ఘాతుకం..
- శివనగర్‌లో కలకలం
- పోలీసుల అదుపులో ఓ నిందితుడు?
- కొరవడిన నిఘా.. యథేచ్ఛగా హత్యలు



నజీర్ (ఫైల్)

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో వరుస హత్యలు కలకలం సృష్టిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం ఇదే పీఎస్ పరిధిలో ఇద్దరు నిందితులు ఓ వృద్ధుడిని గొంతు కోసి అతికిరాతంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఆ ఘటన మరవక ముందే మంగళవారం అర్ధరాత్రి ఓ రౌడీషీటర్‌ను ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన వ్యక్తులు రాడ్లతో తలపై కొట్టి దారుణంగా హతమార్చారు. ఈ ఘటన నగర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ శివనగర్‌కు చెందిన ఎస్‌డీ నజీర్ (37) వరంగల్ రైల్వేస్టేషన్‌లో సబ్ కాంట్రాక్ట్ తీసుకుని మొబైల్ క్యాంటీన్ నడిపిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతడిపై మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదై ఉన్నాయి. అతనిపై రౌడీషీట్ ఉంది. ఇదిలా ఉండగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన పదిమంది వ్యక్తులు బతుకు దెరువు కోసం వరంగల్ వచ్చి శివనగర్‌లో అద్దెకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరంతా రైల్వే స్టేషన్ ప్రాంగణం, రైళ్లల్లో ఎలక్ట్రానిక్స్ గూడ్స్, కీచైన్స్, పర్సులు విక్రయిస్తారు. వీరు స్టేషన్‌లో చిరువ్యాపారం చేసుకునేందుకు సబ్ కాంట్రాక్టర్, మృతుడు నజీర్‌కు నెల వారీగా అద్దె చెల్లించాలి. అయితే చిరువ్యాపారం చేస్తున్నారు. కానీ కాంట్రాక్ట్ డబ్బులు చెల్లించకుండా తిరుగుతున్నారు. రేపు మాపు అంటూ దాటవేస్తున్నారు.

ఇంటికి వెళ్తూ హత్యకు గురై..

మంగళవారం అర్ధరాత్రి నజీర్ క్యాంటీన్ బంద్ చేసి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో శివనగర్‌లోని తిరుమల బార్ పక్కనే ఉత్తర్‌ప్రదేశ్ వారు అద్దెకుంటున్న గదికి చేరుకున్నాడు. ఇరువురు మధ్య కాంట్రాక్ట్ డబ్బుల విషయంలో గొడవ జరగడంతో వారిని నిలదీశాడు. దీంతో ఆగ్రహానికి లోనైన వారు ఐరన్‌రాడ్లతో నజీర్ తలపై బలంగా కొట్టడంతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. నజీర్ చనిపోయాడని నిర్ధారించుకున్న అనంతరం వారు గది నుంచి పారిపోయారు. ఈవిషయం తెలిసిన వెంటనే మిల్స్‌కాలనీ ఎస్సై శ్రీలత, క్లూస్ టీమ్ అధికారులు ఘటనా స్థలికి చేరుకున్నారు. హత్య జరిగిన తీరును పరిశీలించి మృతుడి బంధువులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం నజీర్ మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య రిజ్వాన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీలత తెలిపారు. కాగా, నగరంలో నిఘా కొరవడడంతోనే వరుస హత్యలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

పోలీసులు అదుపులో నిందితుడు..?

నజీర్‌ను దారుణంగా హత్య చేసిన అనంతరం నిందితులు పరారయ్యారు. వీరిలో ఓ వ్యక్తిని రైల్వేస్టేషన్‌లో పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్ తరలించినట్లు సమాచారం. పదేపదే తమను కాంట్రాక్ట్ డబ్బులు అడగడం వల్ల.. పైగా బెదిరించడంతో ఆత్మరక్షణకు హత్య చేశామని చెప్పినట్లు తెలుస్తోంది.

తల్వార్ ఫ్లెక్సీ తొలగింపు

హసన్‌పర్తి: కేయూ పోలీస్‌స్టేషన్ పరిధి గోపాలపురం పాత గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఓ పార్టీ నాయకుడు తన జన్మదినాన్ని పురస్కరించుకుని తల్వార్ పట్టుకుని ఉన్న ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. బుధవారం గుర్తించిన పోలీసులు ఫ్లెక్సీని తొలగించారు.



ఫ్లెక్సీని తొలగిస్తున్న పోలీసులు



నీలి చందమామ..సొగసు చూడతరమా అన్నట్టు కనిపించింది. బుధవారం రాత్రి చంద్రుడు.. భూమికి దగ్గరగా రావడంతో చాలా పెద్దగా కనిపించారు. వరంగల్ నగరంలో రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఇలా నీలిరంగులో సూపర్ మూన్ దర్శనమిచ్చారు.

- సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, హనుమకొండ